www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
బుధవారం
11 జూన్ 2025

## విలేఖరులు కావలెను



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రెజకీయాలు, సామాజిక అంశలపై అవగాహన ఉండి.. రెయగల వెరికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.


సెల్ : 9494 009 003

ఐక్యరాజ్య సమితి నివేదిక

తగ్గిన ఫెర్టిలిటీ రేటు

త్వరలోనే 150 కోట్లకు చేరుతుందని వెల్లడి

# దేశ జనాభా @ 146 కోట్లు







న్యూఢిల్లీ: 2025 సంవత్సరంలో భారత దేశ జనాభా 146 కోట్లకు చేరుకుంటుందని ఐక్య రాజ్యసమితి ఓ నివేదిక వెల్లడించింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలుస్తుందని యూఎన్ డెమోగ్రాఫిక్ రిపోర్టులో తెలిపారు. దేశంలో పునరుత్పత్తి శాతం పడిపోయినట్లు ఆ రిపోర్టులో వెల్లడించారు. యూఎన్ఎఫ్‌పీఏ 2025 స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్టులో ఈ విషయాన్ని తెలిపారు. లక్షల సంఖ్యలో జనం ఫెర్టిలిటీ లక్ష్యాలను అందుకోవడం లేదని ఆ రిపోర్టులో చెప్పారు. ఇది నిజమైన సంక్షోభంగా మారుతోందని, దానికి గల కారణాలు కూడా భిన్నంగా ఉన్నాయని, శృంగారం.. కాంట్రాసెప్షన్, ఫ్యామిలీ అంశాల్లో అవగాహన మారడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు ఆ రిపోర్టులో తెలిపారు.

**తగ్గిన ఫెర్టిలిటీ రేటు..**

భారత్‌లో ఫెర్టిలిటీ రేటు తగ్గిందని, ఆ రేటు 1.9 శాతానికి తగ్గినట్లు రిపోర్టులో వెల్లడించారు. ఆ రేటు కనీసం 2.1గా ఉండాల్సి ఉంది. అంటే భారతీయ మహిళలు సగటున తక్కువ మంది పిల్లలకు జన్మనిస్తున్నట్లు అంచనా వేశారు. జననాల రేటు నెమ్మదిగా ఉన్నా.. దేశంలో యువత జనాభా బాగానే ఉన్నట్లు పేర్కొన్నారు. 0నుంచి 14 ఏళ్ల వారి సంఖ్య 24 శాతంగా, 10 నుంచి 19 ఏళ్ల వారి సంఖ్య 17 శాతంగా, 19 నుంచి 24 వరకు 26 శాతంగా ఉన్నట్లు తేల్చారు. 15 నుంచి 64 ఏళ్ల వర్కింగ్ గ్రూపులో ఉన్నవారి సంఖ్య 68 శాతంగా ఉన్నట్లు తెలిసింది. 65 ఏళ్లు దాటిన వారి సంఖ్య ఏడు శాతంగా ఉంది. అయితే భవిష్యత్తులో వయోవృద్ధుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి. 2025లో పుట్టిన వారి జీవన కాల అంశాన్ని నిర్ధారించారు. సగటున మగవాళ్లు 71 ఏళ్లు, ఆడవాళ్లు 74 ఏళ్లు బతికే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేశారు. భారత జనాభా త్వరలో 150 కోట్లకు చేరుకుంటుందని, ఆ తర్వాత 170 కోట్ల వరకు వెళ్తుందని, అయితే మరో 40 ఏళ్లలో ఆ జనాభా తరుగుదల ప్రారంభమవుతుందని నివేదిక పేర్కొంది. 1960లో భారతీయ జనాభా 44 కోట్లు ఉండేదని, ఆ సమయంలో మహిళలు కనీసం సగటును ఆరుమందిని కనేవారని, అప్పట్లో గర్భనిరోధక విధానాలు తక్కువ అని, ప్రాథమిక విద్య కూడా తక్కువగా ఉండేదన్నారు. కానీ రిప్రొడక్టివ్ హెల్త్ కేర్‌పై అవగాహన పెరగడంతో ఫెర్టిలిటీ రేటు తగ్గుతూ వచ్చిందన్నారు. ప్రస్తుతం సాధారణ భారతీయ మహిళ ఇద్దరికి జన్మనిస్తోందని రిపోర్టులో పేర్కొన్నారు. 1970లో అయిదుగురిని కనేవాళ్లు, ఇప్పుడు ఆ సంఖ్య రెండుకు చేరిందని, పునరుత్పత్తి ఆరోగ్య విషయంలో భారతీయ మహిళల్లో అవగాహన పెరిగిందని యూఎన్ఎఫ్‌పీఏ ప్రతినిధి ఆండ్రియా ఎం వోజ్నర్ తెలిపారు. మెటర్నటీ మోర్టాలిటీ కూడా తగ్గినట్లు తేల్చారు.



## భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం

### హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్

**కలంజ్యోతి, నర్సాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల పరిధిలోని రెడ్డి ఖానాపూర్ దౌల్తాబాద్ తదితర గ్రామాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు స్వీకరణ పరిశీలించి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేటి నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సదస్సులో పలు శాఖల అధికారులు, ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

### మున్నూరు కాపు మండల అధ్యక్షుడు తూము జలపతి



**కలంజ్యోతి, రుద్రంగి :** రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపు సామాజిక వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మున్నూరు కాపు రుద్రంగి మండల అధ్యక్షుడు తూము జలపతి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ... ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి రాకపోవడం రుద్రంగి మండల ప్రజలతో పాటు వేములవాడ నియోజకవర్గ ప్రజలు తీవ్ర నిరాశ చెందారని అన్నారు. కాపు సామాజిక వర్గంలోని శాసనసభ ఎన్నికైన ఆది శ్రీనివాస్ మంత్రి పదవి ఇవ్వాలన్నారు. మరో మూడు మంత్రి పదవులలోనైనా కాపు సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కోరారు. ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇవ్వాలని 33 జిల్లాల్లో సమావేశాలు, ప్రెస్ మీట్ లు నిర్వహించి కాపు సామాజిక వర్గం నుండి బలంగా మా వాదనను వినిపిస్తామని తెలిపారు. త్వరలో జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో రాష్ట్రంలోనే ఎక్కువ జనాభా కలిగి ఉన్న మున్నూరు కాపు వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు.



## ఘనంగా కవ్వంపల్లి జన్మదిన వేడుకలు

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ఇల్లంతకుంట మండల కేంద్రంలో పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానకొండూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి పసుల వెంకటి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మాజీ ఎంపీపీలు ఊట్కూరి రమణారెడ్డి, గుడిసె ఐలయ్యయాదవ్, ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు వెలిశాల జ్యోతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పాక్ దమన నీతిని ఎండగట్టాం

- ప్రధాని మోదీకి వివరించిన ఎంపీల బృందం
- ప్రధానితో ఏడు బృందాల భేటీ
- భారత వైఖరిపై స్పష్టీకరించినట్లు వెల్లడి

**న్యూ ఢిల్లీ :** పహెల్గామ్ దాడి ఆపరేషన్ సిందూర్ అనంతరం విదేశాల నుంచి తిరిగి వచ్చిన ప్రతినిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఎంపీలు ప్రధాని అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. ఈ ఎంపీలంతా భారత్ తరపున పాక్ ఉగ్రవాదాన్ని ఆయా దేశాల్లో ఎండగట్టారు. ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం అయిన వారిలో ఏడుగురు ప్రముఖ ఎంపీలకు టీమ్ లీడ్ బాధ్యతను అప్పగించారు. వీరిలో శశి థరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (బీజేపీ), సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), బైజయంత్ పాండా (బీజేపీ), కనిమొళి కరుణానిధి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ), శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (శివసేన) ఎంపీలున్నారు.

**59 మంది సభ్యులు 33 దేశాలు..**

అమెరికాకు వెళ్లిన వారిలో ప్రధానంగా కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ నేతృత్వంలోని ఎంపీల బృందం ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) సర్ఫరాజ్ అహ్మద్, తెలుగు దేశం పార్టీ (టీడీపీ) గంటి హరీష్ మధుర్ బాలయోగి, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శశాంక్ మణి త్రిపాఠి, భువనేశ్వర్ కలిత, శివసేనకు చెందిన మిలింద్ దేవరా, బీజేపీకి చెందిన తేజస్వి సూర్య ఉన్నారు. వీరంతా జేడీ వాన్స్, విదేశాంగ డిప్యూటీ కార్యదర్శి క్రిస్టోఫర్ లాండౌతో సహా అగ్రశ్రేణి అమెరికా అధికారులను కలిశారు. ఈ విదేశీ పర్యటన ఉగ్రవాదంపై భారతదేశం తన కఠినమైన విధానాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శించడానికి చేసిన ముఖ్యమైన ప్రయత్నంగా చెప్పొచ్చు. ఈ ప్రతినిధి బృందంతో పాటు మాజీ భారత రాయబారి తరంజిత్ సంధు కూడా ఉన్నారు. ఆయన విదేశాంగ విధానం, అమెరికాతో సంబంధాలపై ముఖ్యమైన సూచనలు ఇచ్చారు. ఎంపీ శశిథరూర్ నేతృత్వంలోని బృందం అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియాల్లో పర్యటించారు.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఎంపీల బృందం యూఎన్ సహా 33 సభ్యదేశాలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఏడుగురు ప్రతినిధుల బృంద 59 మంది సభ్యులు 33 దేశాలను సందర్శించారు. వీరిలో 51 మంది నాయకులు, 8 మంది రాయబారులున్నారు.

**భారత్ వైఖరి స్పష్టం..**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విదేశాల్లో తాము ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వివరించిన వివరాలను అందించారు. ఉగ్రవాదం ప్రపంచ మానవాళికి ప్రమాదకరమని, అందుకే వారిని లక్ష్యంగా చేసుకున్నామని స్పష్టం చేశామన్నారు. పాక్ సైన్యం తమపై జరిగిన దాడిగా అభివర్ణించిందన్నారు. భారత్ లోని పౌర సమాజంపై దాడి చేసిందన్నారు. కానీ భారత్ మాత్రం కేవలం ఉగ్రవాద స్థావరాలనే టార్గెట్ గా చేసిందన్నారు. పాక్ కు పదే పదే హెచ్చరికలు చేసినా ఉగ్రవాదాన్ని వీడడం లేదన్నారు. దీంతో భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా చర్యలకు పూనుకోక తప్పలేదన్నారు. దాడిలో లష్కర్ ఎ తోయిబా,టీఆర్ ఎఫ్ పాత్ర ఉందని స్పష్టం చేసినా పాక్ మీనమేషాలు లెక్కించిందన్నారు. గతంలో కూడా అనేక ఆధారాలు, జాబితాలు సమర్పించినా ఒక్క ఉగ్రవాదిపై కూడా చర్యలు తీసుకోలేదని, భారత్ కు అప్పగించలేదని ప్రధానికి ఎంపీల బృందం వివరించింది. భారత్ తరపున ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారం మద్దతు ఇవ్వాలని ఎంపీలు డిమాండ్ చేశారు. భారత్ - పాక్ ఉగ్రవాదాన్ని యుద్ధంగా చూడాలని విజ్ఞప్తి చేశామని ప్రధానికి వివరించారు. పాక్ పట్ల తమ (భారతదేశం) విధానం ఇక పూర్తిగా మారిందని స్పష్టం చేశారు. తమదేశ సార్వభౌమత్వం, ప్రజల మాన ప్రాణాలపై దాడులను ఎన్నటికీ భారత్ సహించబోదని ఎంపీలు ప్రధానికి వివరించారు.

# వల్లంపట్లలో అమ్మ మాట అంగన్వాడీ బాట

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని వల్లంపట్ల గ్రామంలో మంగళవారం 'అమ్మ మాట అంగన్ వాడి బాట' కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సీడీపీఓ ఉమారాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అంగన్వాడీబాటలో భాగంగా కేంద్రాన్ని అలంకరించిన తీరుకు అధికారి సంతోషం వ్యక్తం చేశారు. మామిడి ఆకుల తోరణాలతో అంగన్వాడీ కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారని కొనియాడారు. అనంతరం ఆమె పిల్లల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులతో పాటు గ్రామ పెద్దలుకార్యక్రమంలో భాగ స్వాములు కావాలని కోరారు. కేంద్రంలో నూతన చేరికల పిల్లలను ప్రోత్సహించాలన్నారు. చిన్న వయస్సులో పిల్లలను ప్రయివేట్ పాఠశాలకు పంపిస్తే మానసికంగా,శారీరకంగాఇబ్బందులు ఎదుర్కొంటారని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో అన్ని వసతులతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చంద్రకళ, టీచర్లు దొడ్ల రేఖ, చిత్ర రేఖ, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# డబ్బులు అడుగుతే నాకు చెప్పండి

## ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎవరైనా డబ్బులు అడుగుతే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో జెడ్పీ హెచ్ఎస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండలానికి చెందిన పలు గ్రామాల పేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదల జీవితాల్లో సుస్థిరత తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఖర్చు పెట్టే డబ్బులు అధికారులు మీ బ్యాంకు అకౌంట్ లోనే రూ.5లక్షలు జమ చేస్తారని వివరించారు. ఇళ్లకోసం ఎవరైనా డబ్బులు అడుగుతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందిరమ్మ పథకం ద్వారా పేదల ఇంటి కల నెరవేరుతోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఇల్లు కేవలం నివాస స్థలం మాత్రమే కాదు, అది ఒక కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్ అని, ప్రతి లబ్ధిదారుడి జీవితంలో ఇది కొత్త ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.



**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను దశలవారీగా అందజేస్తామని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ మండలానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల పథక లబ్ధిదారులకు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు పేద ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఈ ప్రజా పాలనలో పేద ప్రజల సమస్యలే పరిష్కారం దిశగా ముందుకు వెళుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించిన అనంతరం ఇందిరమ్మ ఇళ్లలోనే మీ ఆహ్వానం మేరకు మన ప్రభుత్వం ఇచ్చే సన్నబియ్యంతో మీ ఇంట్లోనే భోజనం చేసి వస్తానని హామీ ఇచ్చారు.



# మానయ్య సేవలు మరువలేనివి

## మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజేందర్

**కలంజ్యోతి, నర్సాపూర్ :** పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి దివంగత మానయ్య సేవలు మరువలేనివని హత్నూర మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. మానయ్య జయంతి సందర్భంగా లింగాపూర్ గ్రామంలోని ఆయన విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ మానయ్య ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న సమయంలో నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దడంతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి అనతి కాలంలోనే రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించిన మానయ్య పార్టీ ప్రతిష్ట కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నర్సాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, నాయకులు మణిదీప్, ఆంజనేయులు, ప్రసాద్, శ్రీకాంత్, సాయికుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బస్ పాస్ చార్జీలను పెంచడం సిగ్గుచేటు

## ఏబీవీపీ హైదరాబాద్ నగర కార్యదర్శి పృథ్వీతేజ

**కలంజ్యోతి, హైదరాబాద్ :** విద్యార్థుల బస్ పాస్ ల ఛార్జీలు పెంచడం సిగ్గుచేటని, తద్వారా నిరుపేదలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఏబీవీపీ హైదరాబాద్ నగర కార్యదర్శి పృథ్వీతేజ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలు, విద్యార్థుల పాస్ లను పెంచడంపై మంగళవారం పృథ్వీతేజ మీడియాతో మాట్లాడారు. ప్రజా రవాణాలో ప్రయాణిస్తూ చదువుకునే విద్యార్థుల బస్ పాస్ చార్జీలు పెంచడాన్ని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మళ్ళీ ధరలు పెంచాలని చూడటం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. ఉచిత బస్ కారణంగా సరిపడ బస్ లు లేక విద్యార్థులు తమ ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని ఫుట్ బోర్డ్ ప్రయాణం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపడ బస్సులు నడపడం చేత కానీ, బస్ పాస్, టికెట్ ఛార్జీలు మాత్రం పెంచడం ఏంటని ప్రశ్నించారు. ఏబీవీపీ గతంలో అనేక సార్లు విద్యార్థులు ఎక్కువ ప్రయాణించే దారుల్లో బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్ హామీ కారణంగా వస్తున్న నష్టాన్ని భర్తీ చేయటానికే విద్యార్థుల మీద భారం మోపుతోందన్నారు. ఒక వైపు బస్సులు లేక మరోవైపు విపరీతమైన చార్జీలతో విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్ళే అవకాశం తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే బస్ పాస్ ఛార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.





# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కలంజ్యోతి, వేములవాడ :** చందుర్తి మండల కేంద్రలోని ప్రభుత్వ పాఠశాలలో 2011 - 2012 పదవ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా 13 సంవత్సరాల అనంతరం ఒకచోట కలిసిన సందర్భం అనిర్వచనీ యం. పాత మిత్రులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందంగా పాతరోజులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సత్కరించి పాదాభివందనాలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడుతూ... 13 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులను కలవడం ఆనందంగా ఉందన్నారు. ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయిలో తమ ముందుకు రావడం, సన్మానించడం శుభ పరిణామమని కొనియాడారు. విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అంతకుముందు పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ గురువులు బోధించిన చదువులు, వారి ఆశీస్సుల కారణంగా తామంతా ఉన్నత స్థాయిలో ఉన్నామని పేర్కొన్నారు.




# కేటీఆర్ తో రవీందర్ భేటీ

### కేటీఆర్ కి శ్రీవారి ప్రసాదం అందజేత
### విదేశీ పర్యటన అనంతరం కేటీఆర్ తో సమావేశం

**కలంజ్యోతి, శేరిలింగంపల్లి :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను శేరిలింగంపల్లి యువనేత, పార్టీ సీనియర్ లీడర్ రవీందర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కేటీఆర్ విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ఆయన నివాసంలో మంగళవారం భేటీ అయ్యారు. అదే విధంగా రవీందర్ యాదవ్ తిరుమల శ్రీవారి నుంచి తెచ్చిన ప్రసాదాన్ని కేటీఆర్ కి అందజేశారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని హైదరాబాద్ వచ్చిన అనంతరం కేటీఆర్ ను ఆయన నివాసంలో కలిసి అందజేసినట్లుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ ను కేటీఆర్ పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయాలు, పార్టీ కార్యకర్తలకు సంబంధించి పలు వివరాలు రవీందర్ తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ తీరుపై శేరిలింగంపల్లిలో బలంగా పోరాడుతున్నట్లుగా వివరించారు. స్థానిక సమస్యలపై నిత్యం ప్రశ్నిస్తూ జనం పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. అంతేకాదు పార్టీ కార్యక్రమాలను జనంలోకి తీసుకువెళ్తున్నట్లుగా వివరించారు. రవీందర్ యాదవ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మరింత ముందుకు దూసుకువెళ్లాలని సూచించారు. అనంతరం రవీందర్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రలు చేస్తుందన్నారు. హైదరాబాద్ ఇమేజ్ ను అంతర్జాతయ స్థాయిలో పెంచడంలో కాంగ్రెస్ విఫలం అయ్యిందన్నారు. కేసీఆర్ పాలనలోనే స్వర్ణయుగం సాగిందని రవీందర్ యాదవ్ కొనియాడారు.



# కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసు పెట్టి జైలుకు తరలించడం అప్రజాస్వామికమైన చర్యగా సీనియర్ జర్నలిస్టులు కందికొండ మోహన్, పాదం వెంకటేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు, ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని చెప్పారు. జర్నలిజంలో 50 ఏళ్ల అపార అనుభవం ఉన్న కొమ్మినేనిని అన్యాయంగా అరెస్ట్ చేసి జైలులో పెట్టారని మండిపడ్డారు. టీవీ డిబేట్ లో మాట్లాడే విశ్లేషకుల వ్యాఖ్యలను జర్నలిస్టులకు, మీడియా సంస్థలకు ఆపాదించడం ఏంటని ప్రశ్నించారు. పాత్రికేసులపై ఏదైనా చర్యలు తీసుకునేందుకు చట్టబద్ధ సంస్థలు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉంటుందని, అక్రమ కేసులతో జైలులో పెట్టడం దుర్మార్గమని ఆక్షేపించారు. రాజకీయ కక్షలో భాగంగానే జర్నలిస్టులపై కేసులు, అరెస్ట్ లకు పాల్పడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బాదం పరమేశ్, కాణాపురం ప్రదీప్, శ్రీనుబాబు, మల్లేశ్, రామ్‌లక్ష్మన్, వినయ్, శ్రీశైలం, సాదిక్ పాషా, పిన్నంశెట్టి సైదులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో ప్రతిభ వెలికితీసేందుకే స్నేహ

### యూనిసెఫ్ దక్షిణ భారతదేశ చీఫ్ డాక్టర్ జలాలంమ్ తపస్సే



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** పిల్లలకు స్వేచ్ఛ స్వాతంత్రాలు అందిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో సమాజంలో గొప్పవారిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదని యూనిసెఫ్ దక్షిణ భారతదేశ చీఫ్ డాక్టర్ జలాలంమ్ తపస్సే అన్నారు. మండలంలోని జల్లి గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ, ఆధ్వర్యంలో యూనిసెఫ్ సహకారంతో ఆశాజ్యోతి మండల సమైక్య సౌజన్యంతో సమావేశాన్ని నిర్వహించారు. స్నేహ సంఘం ద్వారా సాధించిన విజయాలను పిల్లలు తెలియజేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పిల్లల పట్ల వివక్షత చూపకూడదని, వారిని ప్రోత్సహించడం ద్వారా ఎంత గొప్ప వారవుతారన్నారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా స్నేహ కార్యక్రమాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చాలా బిజీగా ఉన్నప్పటికీ పిల్లల కార్యక్రమాన్ని తప్పనిసరిగా వీక్షించాలని వచ్చినట్లు తెలిపారు. పిల్లలు అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. పిల్లల కోసం స్నేహా లాంటి కార్యక్రమాలు, ఆరోగ్యము, పోషణ, రక్షణ, లాంటి అంశాలలో ప్రభుత్వం వెనుకాడకుండా పనిచేస్తుందన్నారు.
కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ పిల్లల కోసం ఎటువంటి ప్రత్యేక కార్యక్రమాలైనా పైలట్ ప్రాజెక్ట్ గా జిల్లాలో చేపట్టడం జరుగుతుందన్నారు. స్నేహ సంఘాల ద్వారా పిల్లల్లో చిన్న వయసు నుంచి భవిష్యత్ కు ఉపయోగ పడే అనేక విషయాలను ఇక్కడ నేర్పించడం జరుగుతుందన్నారు. సేఫ్టీ, న్యూట్రిషన్, ఎడ్యుకేషన్,హెల్త్ ఫర్ అడాల్సన్ అనే నినాదంతో ఈ సంఘాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.



కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, సెర్ప్ జెండర్ సీనియర్ అడ్వైజర్ జమున, అడిషన్ ల డీఆర్‌డీఓ రేణుకాదేవి, ప్రాజెక్ట్ మేనేజర్ సరిత, డాక్టర్ బాలకిషన్, మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో నల్ల శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఘాతంతో బర్రెలు మృతి

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం విద్యుత్ ఘాతంతో రెండు బర్రెలు మృతి చెందాయి. స్థానిక మర్రి తిరుపతికి చెందిన బర్రెలు తుమ్మస్ చెరువు సమీపంలో మేతకు వెళ్లాయి. అయితే అపుడే తాటిచెట్టు కొమ్మ విరిగి పడడంతో విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. మేతకు వెళ్ళిన బర్రెలకు తీగలు తగలడంతో షాక్ కి గురై మృతి చెందాయి. దాదాపు లక్షకు పైగా నష్టం వాటిల్లునట్లు రైతు తెలిపాడు. కాగా, ట్రాన్స్కో అధికారులు ఘటన స్థలానికి వెళ్లి విచారించారు.

# మంత్రికి శుభాకాంక్షలు

**కలంజ్యోతి, మల్యాల :** ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నూతనంగా మంత్రి బాధ్యతలు స్వీకరించి మొదటిసారి ధర్మపురికి వచ్చిన సందర్భంగా మల్యాల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్మపురి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కారుక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, నల్లపు మల్లేశం, బాలే శ్రీనివాస్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.





# కవిత అరెస్ట్, విడుదల

**కలంజ్యోతి, హైదరాబాద్ :** పెంచిన బస్ పాస్ ఛార్జీలను తగ్గించాలంటూ బస్ భవన్ ముట్టడికి ప్రయత్నించిన ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచికతుపై కాంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ నుండి ఆమెను విడుదల చేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు.. ధరలు పెంచడం కాదు, ప్రభుత్వం ఆర్టీసీని కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. గతంలో కేసీఆర్ ఇచ్చినట్టు ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి నిధులు కేటాయించాలని సూచించారు. ధరలు పెంచడం వల్ల ప్రజలు ఇబ్బంది పడతారని చెప్పారు. మహిళలకు ఫ్రీ బస్ వల్ల మగవాళ్లు టికెట్ కొనుగోలు చేసి కూర్చున్నా వారికి కూర్చునే అవకాశం లేదన్నారు. టికెట్ రేట్లు పెంచుతున్నారు తప్ప బస్సులు పెంచడం లేదని మండిపడ్డారు. ధర్నా చేసిన ప్రతిసారి అరెస్ట్ చేయడం కాదని, ప్రజల ఆదాయ మార్గాలను పెంచాలని అన్నారు. ప్రజలపై భారం వేస్తూ ఆర్టీసీ ఛార్జీలు పెంచవద్దని అన్నారు. పెంచిన ఛార్జీలు తగ్గించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు.



# కొండగట్టులో భక్తుల సందడి

**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీతో సందడిగా మారింది . వేసవి సెలవులు ముగుస్తుండటంతో వివిధ ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలి రావడంతో క్యూలైన్లు ప్రాంగణము, ఉపాలయాలైన బేతాళ ఆలయం , రామాలయాలు, కోనేరు, కళ్యాణ కట్ట పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి . ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు . ఉదయము స్వామివారికి అభిషేకం,పూజలు నిర్వహించిన అనంతరం మూలవిరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు . పలువురు భక్తులు తామెత్తు బంగారం (బెల్లం,చక్కర) స్వామివారికి సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు.

**అర్చకులు లేడని..**

**భక్తుల సేవలో ఆలయ ఈవో**

ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు. అయితే ఆలయంలో తీర్థప్రసాదాలు అందజేసే అర్చకుడు లేకపోవడంతో భక్తులు అలాగే వెళ్ళిపోయారు. దీనిని గమనించిన ఆలయ ఈవో శ్రీకాంత్ రావు భక్తులకు స్వయంగా స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం కోనేరు కళ్యాణకట్ట పరిసరాలు సహా ఇతర సౌకర్యాలను ఈవో పర్యవేక్షించారు



# టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా గాలి అనిల్ కుమార్



**కలంజ్యోతి, నర్సాపూర్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన గాలి అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కి, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



# చందాపూర్ లో బడిబాట

**కలంజ్యోతి, నర్సాపూర్ :** హత్నూర మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ కుమార్ , ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్చాలని తల్లిదండ్రులకు కోరారు. సర్కార్ బడుల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్నం భోజనం వంటివి ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయులతో విద్యా భోదన అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

6815కి పెరిగిన కరోనా!

# 24 గంటల్లో 68 మంది మృతి

## 14,527 కేసుల్లో 7,644మంది రికవరీ

న్యూ ఢిల్లీ: దేశంలో కరోనా కేసులు మంగళవారానికి 6815కు చేరుకున్నాయి. గత 24 గంటల్లో 68 మరణాలు సంభవించగా, 300 కొత్త కేసులు నమోదయ్యాయి. గ్వాలియర్ లో ముగ్గురు వైద్యులకు కూడా పాజిటివ్ గా తేలడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కేరళలో అత్యధికంగా 2053 కేసులు నమోదయ్యాయి. ఆరోగ్యశాఖ నివేదిక ప్రకారం 12 రాష్ట్రాల్లో 68 మంది రోగులు మరణించారు. మహారాష్ట్రలో అత్యధికంగా 18 మంది మరణించారు. పశ్చిమ బెంగాల్ లో కరోనా కేసుల పెరుగుదలతో సీఎం మమతా బెనర్జీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. మహారాష్ట్రలో 613 కేసులుండగా 18 మంది మృతి చెందారు. జార్ఖండ్ లో 6-1 మరణాలు, కర్ణాటకలో 559-9 మరణాలు, కేరళలో 2053 - 16 మరణాలు, మధ్యప్రదేశ్ లో 52-2 మరణాలు, పంజాబ్ లో 30-2 మరణాలు, రాజస్థాన్ లో 124-1 మరణం, తమిళనాడులో 207-6 మరణాలు, ఉత్తరప్రదేశ్ లో 225-2 మరణాలు, పశ్చిమ బెంగాల్ లో 747-1 మరణం, ఆంధ్రప్రదేశ్ లో 86 కేసులు, అసోంలో 3, బిహార్ లో 48, చండీగఢ్ లో 2, చత్తీస్ గఢ్ లో 44, ఢిల్లీలో 44 కేసులుండగా 8 మరణాలు, గోవాలో 5 కేసులు, గుజరాత్ లో 1109 కేసులు, హరియాణాలో 08, హిమాచల్ ప్రదేశ్ లో 2, జమ్మూకశ్మీర్ లో 9 కేసులు నమోదయ్యాయి. మొత్తం కేసులు 14,527 కాగా 7644 మంది రికవరీ అయ్యారు. 68 మంది మృతి చెందారు. ప్రస్తుతం యాక్టివ్ గా 6815 కేసులున్నాయి.

# టార్గెట్ రీచ్ అవ్వడానికే..

స్టార్ హీరోయిన్ సమంత గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు నిర్మాతగా మారి పలు సినిమాలను తీస్తుంది. అలా రీసెంట్‌గా 'శుభం' మూవీకు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించింది. ఇక మే నెలలో రిలీజ్ అయిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ప్రస్తుతం సమంత 'రక్త బ్రహ్మాండ్' అనే మూవీలో హీరోయిన్‌గా యాక్ట్ చేస్తుంది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ సామ్ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. అలాగే తన వ్యక్తిగత విషయాలను పంచుకుంటు ఫాలోవర్‌స్‌ను పెంచుకుంటుంది. ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా సమంత తన ఇన్‌స్టాగ్రామ్ లో ఓ వీడియో షేర్ చేసింది. అందులో గన్ పట్టుకుని షూట్ చేస్తున్నట్లు కనిపించింది. ఇక దీనికి టార్గెట్ రీచ్ కావడానికి ప్రాక్టీస్ చేస్తున్నాను అనే క్యాప్షన్ రాసుకొచ్చింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారగా.. నెటిజన్లు ఆమె ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఎవరిని షూట్ చేద్దామని అలా ప్రాక్టీస్ చేస్తున్నావని కామెంట్స్ చేస్తున్నారు.



